క్లుప్తంగా

ప్రజలకు పీవీఎల్ ఉగాది శుభాకాంక్షలు


మాట్లాడుతున్న పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలంతా ఎంతో ఆనందంగా ఉన్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పెదఅమిరం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, పాడిపంటలతో తులతుగాలని పీవీఎల్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

స్వామివార్ల సేవలో పీవీఎల్

బొండాడలో వేంచేసియున్న భోగేశ్వరస్వామి, జనార్దనస్వామి వార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివార్లను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

ఉగాది పురస్కారాల అందజేత

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం పరిసర ప్రాంతాల్లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వ్యక్తులకు మంగళవారం బీసీ సంక్షేమ సంఘం, కోడే వీరమ్మ సేవా సమితిల సంయుక్త ఆధ్వర్యంలో పంచారామ క్షేత్రం శ్రీ ఉమా సోమేశ్వర జనార్దన స్వామి ఆలయ ప్రాంగణంలో ఉగాది పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వన్ టౌన్ సీఐ ఎ.శ్రీను, ఈవో అరుణ్‌కుమార్ చేతులమీదుగా సేవాతత్పరులకు పురస్కారాలు అందించారు.

ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం

వీరవాసరం : అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు (బాబు)ను వీరవాసరం మండలం ఎంపీటీసీలు, సర్పంచులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరు ఓంకార్ మాట్లాడుతూ వీరవాసరం మండలానికి మొట్టమొదటిగా ఏఎంసీ చైర్మన్ ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పార్టీలకతీతంగా అఖిలపక్ష నాయకులంతా కలిసి సన్మానించడం అభినందనీయమన్నారు.

స్కిల్ హబ్ ద్వారా ఉచిత శిక్షణ

ఆకివీడు: దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఫీల్డ్ టెక్నీషియన్ ఎయిర్ కండిషన్, హ్యాండ్ ఎంబ్రాయిడరీలో (మహిళలకు) మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వల్పకాలిక (3 నెలలు) ఉపాధి కోర్సులో శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 10, 5వ తరగతులు ఉత్తీర్ణులై 45 ఏళ్ల లోపు అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోపు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు 90 శాతం హాజరుతో శిక్షణ పొందే వారికి ప్రతి నెలా ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

జగన్ పాలనలో విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత


కాళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న ప్రజాప్రతినిధులు


కుముదవల్లి హైస్కూల్లో విద్యార్థినికి రాగి జావ అందిస్తున్న ఎంపీపీ చంటిరాజు, సర్పంచ్ వంశీకృష్ణంరాజు


ఉండి హైస్కూల్‌లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఇందుకూరి, సర్పంచ్ సౌజన్య

కాళ్ల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తోందని జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు అన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలో ఆయా పాఠశాలల్లో ప్రారంభించారు. ప్రధానంగా మండల కేంద్రమైన కాళ్ల, కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్దలో మరో పోషకాహారం విద్యార్థులకు అందించటం అభినందనీయమన్నారు. మంగళవారం నుంచి బడి పిల్లలకు ఉదయం పూట పోషకాహారంగా రాగి జావ ఇవ్వాలనే ప్రభుత్వం నిర్ణయం హర్షణీయమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి రోజు మెనూ ప్రకారం ఆరోగ్యకరమైన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని కోరారు. వారంలో మూడు రోజులు పాటు బెల్లంతో కూడిన రాగిజావను విద్యార్థులకు జగనన్న ప్రభుత్వం అందిస్తుందన్నారు. దొడ్డనపూడిలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిర్మల పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమంలో గంటా బాలు, గనిశెట్టి పండరీకాక్షుడు, బండి మహంకాళి, చిన్నాపరపు రాంబాబు భూపతిరాజు జగ్గారాజు పాల్గొన్నారు.

పాలకోడేరు: కుముదవల్లి హైస్కూల్‌లో ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, సర్పంచ్ వంశీకృష్ణంరాజు విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. గొరగనమూడిలో స్వామి జ్ఞానానంద జెడ్పీ హైస్కూల్లో సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు, మాజీ సర్పంచ్ వైఎస్సార్ సీపీ నాయకులు చెల్లబోయిన పాపారావు విద్యార్థులకు రాగిజావ అందించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పంపన రామకృష్ణ పాల్గొన్నారు.

ఉండి : సర్పంచ్ కమతం సౌజన్య ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉండి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కమతం బెనర్జీ, హెచ్‌ఎం కే బేబీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉణుదుర్రులోని ఎంపీపీ స్కూల్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి జీ సుందర్‌కుమార్ విద్యార్థులకు రాగిజావ అందించారు.

ఆకివీడు: మండలంలోని చినకాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), ఎంపీపీ కఠారి జయలక్ష్మి విద్యార్థులకు రాగిజావ అందజేశారు. అజ్జమూరులో సర్పంచ్ చెలంకూరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ. జహంగీర్ ఎంపీపీ పాఠశాలలో రాగి జావను విద్యార్థులకు అందజేశారు. ఆకివీడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్ కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్ రాగి జావ అందజేశారు. స్థానిక శివాలయం స్కూల్‌లో తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గరోతు విజయ్‌కుమార్, మోరా జ్యోతి, కుందాడ బాబ్జీ తదితరులు రాగి జావ విద్యార్థులకు అందజేశారు.

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణంలోని 21 వ వార్డు పెద్ద పేట ప్రాథమిక పాఠశాలలో జగనన్న రాగి జావ విద్యార్థులకు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ జంగం మాణిక్యాలరావు, పార్టీ నేతలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం రాయకుదురు సర్పంచ్ గడ్డం భారతి విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. వీరవాసరం, నేలపోగుల, ఉత్తర పాలెం, తోలేరు, చింతలకోటి గరువు, మత్స్యపూరి, నవుడూరు, అండలూరు తదిత గ్రామాల్లోని పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.


ఆకివీడు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు రాగి జావను అందజేస్తున్న చైర్‌పర్సన్ జామి హైమావతి


భీమవరం 21వ వార్డులో విద్యార్థినులకు రాగి జావ అందించిన దృశ్యం


రాయకుదురులో రాగిజావ పంపిణీ చేస్తున్న దృశ్యం

సోమాలమ్మకు ప్రత్యేక పూజలు

పాలకోడేరు: పాలకోడేరు శివారు ఏఎస్‌ఆర్ నగర్‌లో వెంచేసియున్న శ్రీ సోమాలమ్మ అమ్మవారికి మంగళవారం గ్రామస్తులు విశేష పూజలు నిర్వహించారు. గ్రామ దేవత కావడంతో గ్రామస్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి గరగలకు జలాభిషేకం, పంచామృతాలతో పూజలు చేశారు. బుధవారం ఉగాది పండుగను పురస్కరించుకుని 108 రకాల పిండివంటలతో అమ్మవారికి నైవేద్యం ఏర్పాటు చేయనున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అన్నసమారాధన చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పోలేరమ్మ జాతర

ఉండి: వాండ్రంలో పోలేరమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పంచామృత కలశాలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. గ్రామంలో భారీ ఊరేగింపు జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పీవీఆర్కే ఆంజనేయరాజు, ఆలయ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల సుబ్బరాజు పాల్గొన్నారు.

వైద్య పరికరాల కొనుగోలుకు తీర్మానం

ఉండి: పీహెచ్‌సీలలో వైద్యం ద్వారా ప్రజారోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీపీ, ఉండి పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో డాక్టర్ పీ ధర్మతేజ్ ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు సౌకర్యాల మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. గర్భిణుల పరీక్ష కోసం ప్రత్యేక పరికరాల కొనుగోలు చేయాలని తీర్మానించారు. ఇందుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై అత్యంత శ్రద్ధ వహిస్తోందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై మరింత జాగ్రత్త తీసుకుంటున్నారని అన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై నివేదికలు అందిస్తున్నారని అన్నారు. సర్పంచ్ కమతం సౌజన్య, కమతం బెనర్జీ, వైద్యాధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ సమస్యలను పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): వక్ఫ్‌బోర్డు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎండీ కరిముల్లా బాషా కోరారు. ఈమేరకు బుధవారం విజయవాడలో స్టేట్ వక్ఫ్‌బోర్డు ప్రత్యేక అధికారి షీరీన్ బేగం, ఎస్‌ఈఆర్‌పీ సీఈవో, ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. షీరీన్ బేగం స్పందిస్తూ అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తులను జిల్లా సిబ్బంది సహకారంతో గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి అందించాలని, వాటిని పరిశీలించి వక్ఫ్ బోర్డ్ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భీమవరం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం : భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతన పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలో ప్రజలకు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తాడేరు వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.30 కోట్లు నిధులు మంజూరు చేయగా టెండర్ ప్రక్రియ పూర్తికావడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శంకుస్థాపనకు జాప్యం జరిగిందని చెప్పారు. పట్టణంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.36 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. విస్సాకోడేరు లేఔట్‌లో సుమారు 3 వేల జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఇప్పటికే అయిదు రైల్వే అండర్ టన్నెల్స్ నిర్మించగా మరొక మూడు చోట్ల నిర్మించాలని రైల్వేశాఖను కోరినట్లు శ్రీనివాస్ వివరించారు. నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రజలు తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు.

పంచాయతీరాజ్ పనులు వేగంగా పూర్తిచేయాలి

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ డీఈ గుద్దటి స్వామినాయుడుతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎండీఎఫ్ పథకంలో రూ.2 కోట్లు నిధులు మంజూరు కాగా వాటిలో రూ. 70 లక్షలు 17 పనులకు కేటాయిస్తూ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. మరొక 10 పనులకు రూ.64 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించినట్లు ఎమ్మెల్యే శ్రీనివాస్ చెప్పారు.

మావుళ్లమ్మ సన్నిధిలో...

భీమవరం(ప్రకాశం చౌక్) : బలుసుమూడిలో శ్రీమావుళ్ళమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మంగళవారం దర్శించారు. అనంతరం ఆలయ పునః నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ.2 లక్షలు విరాళంగా ఇస్తానని ప్రకటించారు.

మంచి అలవాట్లతోనే రోగాలు దూరం

పాలకోడేరు: సమయపాలన, మంచి అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా రోగాల నుంచి కాపాడుకోవచ్చని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వర్ణ నిరంజని అన్నారు. గొరగనమూడిలో మంగళవారం హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్ నిర్వహించారు. స్వర్ణ నిరంజని రోగులకు వైద్య పరీక్షలు చేసి సూచనలు అందించారు. 104 వైద్యుడు సూర్యనారాయణ రాజు, సూపర్వైజర్లు శంకర్, చండీరాణి ఎంఎల్‌హెచ్‌పీ రోమోలా, ఏఎస్ఎం వేదకుమారి పాల్గొన్నారు.

విలేకరి వేధింపులపై ఎస్పీకి ఫిర్యాదు చేశాం

పాలకోడేరు: ఓ విలేకరి వేధింపులు భరించలేక అతనిపై గ్రామస్తులతో కలిసి జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌కు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు చెప్పారు. మంగళవారం గొరగనమూడిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓ చానల్ విలేకరిని అని అయినసంకెళ్ల రాంబాబు చెప్పుకుంటూ గ్రామంలో రౌడీయిజం చేస్తూ కులాల మధ్య చిచ్చు పెడుతున్నాడని ఆరోపించారు. విలేకరి చేష్టలతో గ్రామస్తులు విసిగి గ్రామసభ ఏర్పాటు చేసి అతనిపై చర్యలు తీసుకోవాలని తీర్మానించారన్నారు. రాంబాబుపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు దళిత నాయకుడు పొన్నమండ బాలకృష్ణ, పద్మశాలీల సంఘ రాష్ట్ర నాయకుడు బళ్ళ పరమేశ్వరరావు మాట్లాడారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు పరిధిలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారిణి వి.వాణీ విజయరత్నం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంటుమిల్లిలో మూడో నంబర్, పెదఅమిరంలో రెండో నంబర్, పెదఅమిరంలో మూడో నంబర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక్కో పోస్టు చొప్పున జనరల్ అభ్యర్థులకు, పెన్నాడలో ఒకటో నంబర్ కేంద్రంలో బీసీ–ఈ కేటగిరి అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అర్హులన్నారు. అలాగే అభ్యర్థులు స్థానికులై వివాహితులైన మహిళలు, 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులన్నారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

భీమవరం పరిధిలో..

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మి కాంతం తెలిపారు. ఈనెల 23వ తేదీ నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రాజెక్ట్ పరిధిలోని భీమవరం దుర్గాపురం –1 కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసి పీహెచ్), నేతాజీ పుంత 1 కేంద్రంలో కార్యకర్త (ఓసీ), రాయలు కేంద్రం–2లో సహాయకురాలు (ఓసీ), లంకపేట కేంద్రంలో సహాయకురాలు (ఎస్టీ), కరకు వాడ కోడ్ నెంబర్ 249 కేంద్రంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త (బీసీ సీ), గొంది కోడ్ నెంబర్ 255 కేంద్రంలో కార్యకర్త (ఓసి) పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వీరవాసరం అభివృద్ధికి చర్యలు

వీరవాసరం : మండల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సంబంధిత శాఖ అధికారులు ఖచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని గూడూరు ఓంకారం, కోటిపల్లి బాబు ,గడ్డం భారతి, పంజా మంగతాయారు, బోను జ్యోష్ణ దేవి తదితరులు కోరారు. ఎంపీడీవో ఉమామహేశ్వర రావు హౌసింగ్ డీఈ వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు,, అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, గుల్లిపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఎన్నో లాభాలు

పాలకోడేరు: చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకుంటే శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని మోగల్లు సర్పంచ్ కృష్ణకుమారి, పాలకోడేరు సర్పంచ్ ఇంజేటి మరియమ్మ అన్నారు. మంగళవారం నాడు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ్ ప్రోగ్రామ్ కింద చిరు ధాన్యాలు వాడటం వల్ల కలిగే ఉపయోగాలను కార్యకర్తలు వివరించారు.